మండలంలో విజృంభిస్తున్న విష జ్వరాలు

విశాలాంధ- వై.రామవరం: అల్లూరి జిల్లా వై.రామవరం లో గత 10 రోజులు గా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. తీవ్ర జ్వరం, మోకాళ్లు, కీళ్ళ నొప్పుల, శరీరం పై దద్దుర్లు వంటి లక్షణాలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు, కొందరు స్థానిక సామాజిక ఆసుపత్రి కి చేరుతున్నారు. ఆసుపత్రిలో ఉన్న రక్త పరీక్షల్లో టైఫాయిడ్ జ్వరాలు నమోదు అవుతున్నాయి. అన్నిరకాల రక్త పరీక్షలు లేకపోవడం తో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు, క్లినిక్ ల వైపు దారి తీస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి - ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాహుల్ : ప్రస్తుతం టైఫాయిడ్, చికున్ గున్యా లక్షణాలతో రోగులు వస్తున్నారన్నారు. వాతావరణ మార్పులు, త్రాగునీరు ప్రబావాలతో ఇటువంటి వ్యాధులు వస్తున్నాయని ఆసుపత్రి సూపరిండెంట్ డా.రాహుల్ తెలిపారు. వ్యాధి సోకిన వెంటనే ఆసుపత్రి కి వచ్చి వైద్యం పొందాలని ఆయన అన్నారు.

మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం చేయండి

గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. కన్నబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. కన్నబాబు ఆదేశించారు. శనివారం ఏజెన్సీలో పర్యటించిన ఆయన తాజంగి గ్రామంలో నిర్మాణంలో ఉన్న స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు పరిశీలించారు. నిర్మాణం పనుల్లో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణం ప్రోగ్రెస్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి .అభిషేక్, సహాయ ప్రాజెక్టు అధికారి వివిస్ ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈ ఈ డివిఆర్ ఎం రాజు, డి ఈ చాణక్య, ఏఈ యాద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేత

విశాలాంధ్ర-కొమరాడ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన నాలుగు లక్షల రూపాయలు చెక్కు ను బాధితుడు సంకెలి ఉదయ్ కుమార్‌కు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం అందజేశారు. కురుపాం నియోజకవర్గం, కొమరాడ మండలం, విక్రంపురం గ్రామానికి చెందిన సంకిల్లి ఉదయ్ కుమార్ అనే వ్యక్తికి అనారోగ్యం, నడవలేని పరిస్థితుల్లో ఉన్నారని గతంలో శాసనసభ్యులకు దృష్టికి తీసుకు రావడం జరిగింది. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం కోరడం జరిగింది వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి నాలుగు లక్షల రూపాయలు మంజూరు చేశారు. మంజూరైన చెక్కును కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి చేతులమీదుగా లబ్ధిదారుడు ఉదయ్ కుమార్‌కు అందజేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, ఎంపీటీసీ త్రినాధ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు దాటిన నిర్మాణాలు తొలగించాలి

జాతీయ రహదారి అధికారులు నోటీసులు

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : జాతీయ రహదారికి సరిహద్దులు దాటి దుకాణాలు నిర్మించున్న లబ్ధిదారులు మూడు రోజుల్లో తొలగించుకోవాలని జాతీయ రహదారి అధికారులు మండల కేంద్రం డుంబ్రిగుడలో దుకాణదారులకు నోటీసులను జారీ చేశారు. దుకాణదారులు నష్టపోయిన ఆస్తి నష్టానికి జాతీయ రహదారి విభాగ అధికారులు సర్వేను నిర్వహించి నష్ట పరిహారాన్ని చెల్లించారు. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మిగిలిన స్థలాల్లో దుకాణదారులు హద్దుమీరి నిర్మాణాలు చేపట్టడంతో సంబంధిత అధికారులు రెవెన్యూ యంత్రాంగానికి నివేదికలు అందజేశారు. రోడ్డు పనులు పూర్తి చేయకుండనే నిర్దేశించిన స్థలాల్లో దుకాణదారులు జాతీయ రహదారికి సరిహద్దు దాటి నిర్మాణ పనులు చేపట్టడంతో సంబంధిత అధికారులు మూడు రోజుల్లో తొలగించుకోవాలని రెవెన్యూ అధికారులతో నోటీసులు జారీ చేశారు. లేనిపక్షంలో జాతీయ రహదారికి ఇబ్బందులు కలిగించే షాపులను తమ మిషన్లతో తొలగించడం జరుగుతుందని నోటి ద్వారా హెచ్చరించారు.

మసీదు నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

విశాలాంధ్ర-చింతూరు : చట్టి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మసీదు నిర్మాణానికి గాను తన వంతు సాయంగా వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ జమాల్ ఖాన్ గురువారం ముస్లిం సహోదరులకు 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, ఉత్తమ అలవాట్లు, దయాగుణం, దానగుణం, సహనం వంటి మంచి గుణాలను మనుషులకు అందించే ఒక మంచి గ్రంథాలయం మసీద్ అని పేర్కొన్నారు. నడవడికను మార్చి దైవం వైపు మనిషిని నడిపించే ఒక దేవాలయం మసీదు అని ఆయన తెలిపారు. మసీదు నిర్మించి అందులో ప్రతిరోజు 5 పూటల నమాజు చదివినప్పుడే మనం నిర్మించుకున్న మసీదుకు విలువ విశిష్టతలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు ముస్లిం సహోదరుడు నమాజ్ ప్రార్ధనలకు హాజరై తనవంతు కర్తవ్యంగా మసీదు అభివృద్ధి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెకె సిట్టి ట్రస్ట్ కార్యదర్శి మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, చట్టి గ్రామస్తులు చాంద్ పాషా, అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

మావోలకు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లు

విశాలాంధ్ర-ఎటపాక : మావోలకు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లు వెలసాయి. శనివారం ఎటపాక మండలంలోని నందిగామ, మరుమూరు, బాసవాగు, లక్ష్మీపురం, మధరావుపేట, నెల్లిపాక, బండిరేవులో రహదారి పక్కన, భారీ వృక్షాలకు, బస్ షెల్టర్‌లకు మావోలకు వ్యతిరేకంగా పోస్టర్లు గిరిజన అభ్యుదయ సంఘం, అల్లూరి ఆదివాసీ సంఘం పేరుమీద వేలసాయి. ఎవరికోసం ఈ మావోయిస్టు వారోత్సవాలు, వజ్రోత్సవాలని, మీ ఉచ్చులోకి లాగవద్దు, సభలంటూ, సమావేశాలంటూ మమ్ము వేదించవద్దు, స్థూపాలు కట్టాలని మీ పాపల్లో పాలు పంచవద్దు. మీ దారికి రావాలని బెదిరించవద్దు , మా గిరిజనుల సహనం పరిక్షించవద్దు అని గోడ పత్రికల్లో పేర్కొన్నారు.

వైసీపీ నుండి టిడిపిలోకి వలసల పర్వం

ముఖ్యమంత్రి చేతులమీదుగా పార్టీ కండువా కప్పుకున్న జెడ్పీటిసి, ఎంపీపీ, మరికొంతమంది నాయకులు

విశాలాంధ్ర-పాడేరు : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారుగా నాలుగు నెలలు కావొస్తుంది. ఈ తరుణంలో వైసిపి కి చెందిన ముఖ్య నాయకులతో పాటు అనేకమంది వైసిపి కార్యకర్తలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఆకర్షితులై వలసల బాట పడుతున్నారు. రాష్ట్రంలో అనేకచోట్లవైసిపి మద్దతుదారులైన టువంటి రాజ్యసభ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, జెడ్పిటిసిలు ఎంపిటిసిలు, పట్టారు. శనివారం పాడేరు నియోజక వర్గం ముఖ్య నాయకులైనటువంటి పాడేరు జడ్పిటిసి కిముదు గాయిత్రి దేవి, ఎంపీపీ సోనాయి రత్నకుమారి, సీనియర్ నాయకులు అయినటువంటి సోనాయి, రమణమూర్తి, యువ నాయకులు, కిముదు

విశ్వలతోపాటు జిమాడుగుల, చింతాపల్లి, జీకే వీధి, మండలాలకు చెందిన ఎంపీటీసీలు స్థానిక టిడిపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మంగళగిరి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ కండువలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా

చంద్రబాబు నాయుడు వారితో మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గం ఇంచార్జి గిడ్డి ఈశ్వరి తో కలిసి పనిచేస్తూ మీ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే పార్టీన్ని బలోపేతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికై కృషి చేస్తున్న గిడ్డి ఈశ్వరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు.

తొమ్మిది లక్షల విలువైన 187 కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-గంగవరం : గంగవరం గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేపట్టగా గంజాయి తరలిస్తున్న వాహనాన్ని నలుగురు వ్యక్తులను అదుపులో కి తీసుకున్నట్లు గంగవరం ఎస్ఐ డిభూషణం తెలిపారు దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం ఉదయం గంగవరం గ్రామ శివారులోని నెమలి చెట్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా టాటా ఏసీ వాహనం ఏపీ 03టి సి4865 వాహనంలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు గంగవరం తాసిల్దార్ శ్రీనివాసరావు సమక్షంలో పంచనామా నిర్వహించగా 187 కేజీల గంజాయి ఉనట్లు గుర్తించారు. దీని విలువ సుమారు తొమ్మిది లక్షల 35000 ఉంటుందని అని తెలిపారు వాహనంలో ఉన్న ముగ్గురు మహిళలు ఒక వ్యక్తిని అదుపు తీసుకోవడం జరిగిందని వీరు చిత్తూరు జిల్లా పుంగనూరు కు చెందిన పూల వెంకటమ్మ,మల్లం రాజమ్మ,ఆవుల రవి, కస్తి నాగభూషణం లను రంపచోడవరం కోర్టులో హాజరు పరచడం జరిగిందన్నారు. గంగవరం ఎస్ఐ భూషణం కేసు నమోదు చేయగా అడ్డతీగల సీఐ నరసింహా మూర్తి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

కాఫీ దిగుబడులు పెంచడానికి చర్యలు

గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కె.కన్నబాబు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ మిరియాలు దిగుబడులు పెంచడానికి చర్యలు చేపడుతున్నామని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కె. కన్నబాబు అన్నారు. శనివారం మోదపల్లి గ్రామ వద్ద కాఫీ తోటలను పరిశీలించారు. కాఫీ రైతు కొర్ర వెంకటరావు తో మాట్లాడి కాఫీ,మిరియాలు సాగు పై ఏడాదికి వస్తున్న ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్గానిక్ పద్ధతులతో సాగు చేస్తున్న అరుకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి లభించిందని చెప్పారు. కాఫీ రైతులు బేబీ పల్పర్లు, ట్రసర్లు, టార్పాలిన్లు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. అనంతరం కందమామిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో చర్మవ్యాధుల వైద్య శిబిరాన్ని సందర్శించారు. చర్మవ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు సబ్బులు, మందులు పంపిణీ చేశారు. 9వ తరగతి క్లాస్ రూమ్ లో సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. మరుగుదొడ్లను వంటగదిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత పాడేరు వి.డి.వి. కె. కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

30న జరిగే శిక్షణకు హాజరు కావాలి

విశాలాంధ్ర -డుంబ్రిగూడ : అరకులోయ నియోకవర్గ కేంద్రంలో ఈనెల 30న శిక్షణకు హాజరు కావాలని టిడిపి మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు తెలిపారు. బూత్, యూనిట్ ఇన్చార్జిలకు ప్రత్యేకంగా శిక్షణ ఉంటుందన్నారు. ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల చెంతకు చేరే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుంద న్నారు. నియోకవర్గ కేంద్రంగా జరిగే శిక్షణలో బూత్, యూనిట్ ఇన్చార్జిలతోపాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

3, 4, 5 తరగతుల విలీనం నిలిపివేతపై హర్షం : పిఆర్టీయు

విశాలాంధ్ర-బెలగాం : గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని దానిని రద్దు చేయమని కోరిన మీదట యువగళం పాదయాత్రలో ఇప్పటి విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం విద్యాశాఖ జీవో 117 ను రద్దు చేయడానికి నిర్ణయం తీసుకోవడం పట్ల పిఆర్టీయు అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్ హర్షం వెలిబుచ్చారు. బదిలీలు, పదోన్నతుల కోసం కొత్తగా చట్టాన్ని తీసుకువచ్చి అమలు చేస్తాననడం కూడా ఆనందదాయకమని సూర్యనారాయణ తెలిపారు. అయితే చట్టం చేసేముందు విద్యావేత్తలతో, మేధావులతో, సంఘాలతో, శాసనమండలి సభ్యులతో చర్చించి వారి అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని పిఆర్టీయు నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. విద్యావ్యవస్థలో ఏ మార్పు తీసుకు రావాలన్నా అభిప్రాయ సేకరణ చేయడం మంచిదని సూర్యనారాయణ హితవు పలికారు.

మూడు కంటైనర్లు సీజ్

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో గల పికోనవలస చెక్ పోస్ట్ వద్ద పాచిపెంట ఎస్సై, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిస్సా నుంచి వస్తున్నటువంటి మూడు కంటైనర్ లారీలను ఆపి తనిఖీ చేయగా వాటిలో పశు వులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా పశువులను లారీలలో తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు ఈ మేరకు కేసు నమోదు చేసి మూగ జీవాలను గోసాలకు తరలించడం జరిగినట్లు పాచిపెంట ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు.

'మన ఇల్లు మన గౌరవం' ద్వారా రూ.60 కోట్లు మంజూరు

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలో మన ఇల్లు మన గౌరవం ప్రధానమంత్రి ఆవాజన యోజన గ్రామీణ పథకం ద్వారా 2021- 22 సంవత్సరంలో మంజూరైన 1109 గృహాలకు వివిధ స్టేజిలో గృహాలు పనులు జరిగి నిలిచిపోయినటువంటి గృహాలకు కేంద్ర ప్రభుత్వం రూ 60 కోట్లు నిధులు మంజూరు చేసిందని సీతంపేట మండలం గోయిది పంచాయతీలో జరిగిన గ్రామసభలో స్పెషల్ ఆఫీసర్ గయాజుద్దీన్ తెలిపారు. (పిఎంఎవైజి) పథకంలో మంజూరైన గృహ లబ్ధిదారులు ఇప్పటివరకు పూర్తిగా ప్రారంభించినటువంటి గృహాలు 82 మరియు, 236 పునాదికంటే దిగువ గుమ్ములు లెవెల్ లో ఉన్న గృహాలు మరియు, 269 పునాదులు వరకు నిర్మించిన గృహాలు, అదేవిధంగా 210 గృహాలు స్లాబ్ లెవెల్, మరియు 163 స్లాబులు పూర్తయిన గృహాలు, మరో 149 గృహాలు పూర్తిగా ఇంటి పనులు జరిగి గృహప్రవేశాలు జరిగాయని గృహ నిర్మాణ శాఖ సిబ్బంది తెలిపారు. ఒక్కో ఇంటికి రూ 1,80,000 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ పనులన్నీ ఫిబ్రవరి మాసంతానికి పూర్తి చేయాలని, లబ్ధిదారులకు నిధులు కొరతలేదని తెలిపారు. ఈ పథకంలో మంజూరైనటువంటి గృహ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, హౌసింగ్ ఏఈ సిహెచ్. వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -సీతంపేట/భామిని : మండలాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 పార్వతీపురం మన్యం లిజిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన పత్రాలను భామిని, సీతంపేట మండలంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బత్తిలి,పెద్ద దిమిలి, సీతంపేట మండల కేంద్రంలోగలరెండుపాఠశాలలను,ప్రాథమికోన్నత పాఠశాల కాట్రగడ(బి) సులకజోడు, భామిని మండల కేంద్రంలో గల 3 పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను తెలుసుకోవడం జరిగినది అని తెలిపారు. అదేవిధంగా అందరిని విజయనగరంలో జగన్నాథ కళ్యాణ మండపం జె కన్వెన్షన్ ఫూల్‌బాగ్ రోడ్ నందు అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో జరగబోవు 20 వ విద్యా వైజ్ఞానిక మహాసభలు, 80 వసంతాల జూబ్లీ వేడుకలకులి ఉపాధ్యాయ సిబ్బందికి సాదరంగా ఆహ్వానంచడం జరిగినది. ఈ కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి పువ్వల కూర్మినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పువ్వల. ధనంజయరావు, పార్వతీపురం మన్యం జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు మీసాల ప్రసాదరావు, రంగు ముద్రి ఫకీర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కిషోర్ దేవ్ డిగ్రీ కళాశాల విరాళం

విశాలాంధ్ర-కురుపాం : విజయవాడ వరదల బాధితుల సహాయార్థం విరాళాన్ని ఆంధ్ర యూనివర్సిటీ డీన్‌కు అందజేశారు. కిషోర్ చంద్ర దేవ్ డిగ్రీ కళాశాల కురుపాం ప్రిన్సిపాల్ వి.గురువులు, వైస్ ప్రిన్సిపాల్ జి.మహేంద్ర, కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం అక్షరాల 51వేల 116 రూపాయలను ఆంధ్ర యూనివర్సిటీ డీన్‌కు చెక్కు రూపంలో అందజేశారు. సిడిసి టివి క్రిష్ణా, ఆంధ్ర యూనివర్సిటీ డీన్ ప్రిన్సిపాల్‌ని వైస్ ప్రిన్సిపాల్‌ని కళాశాల సిబ్బందిని విద్యార్థినీవిద్యార్థులను అభినందించారు.

అక్టోబర్ 2న 'పీఎం జుగా' ప్రారంభం

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పీఎం జుగా) కార్యక్రమాన్ని అక్టోబర్ 2న ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పీఎం జుగా మరియు పీఎం జన్ మన్ (ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమాల కొనసాగింపు ఏర్పాట్లపై శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి అక్టోబర్ 2న జార?ండ్ లోని హజారీబాగ్ లో పిఎమ్ జుగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఈకార్యక్రమం దేశంలోని 140కి పైగా జిల్లాలకు ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుందని ఆయన తెలియజేశారు. ఆరోజు పార్వతీపురంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్వతీపురం ఐటిడిఏ ప్రాంగణంలో నిర్వహించుటకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ కార్డులు నమోదు, పీఎం ఉజ్వల్ ఉచిత గ్యాస్, ఆధార్ కార్డుల నమోదు, జల్ జీవన్ మిషన్లో ఇంటింటికి కుళాయిలు, పివిటిజి గ్రామాలలో రహదారులు వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిని వివరించే స్టాల్స్ లను అన్ని సంబంధిత విభాగాలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి, భారత ప్రభుత్వం నియమించిన నోడల్ అధికారి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని ఆయన తెలియజేశారు. ఈసమావేశంలో పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్ర రావు, జిల్లా ఆర్.డబ్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు,జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి రవి, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్. మన్మథ రావు, జిల్లా విద్యా శాఖ అధికారి జి. పగడాలమ్మ, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాల కలకు శ్రీకారం

పాచిపెంట మెయిన్‌రోడ్డుకు మోక్షం

విశాలాంధ్ర-పాచిపెంట : మండల కేంద్రమైన పాచిపెంట మెయిన్ రోడ్డు అధ్వాన్న పరిస్థితి నుండి విముక్తి కలుగింది. 15 ఆర్థిక సంఘం నిధుల నుండి 200 మీటర్ల రహదారి పనులకు మోక్షం లభించింది. గత 20 ఏళ్లలో నలుగురు సర్పంచ్‌లు మారినా పాచిపెంట మెయిన్ రోడ్డు పరిస్థితి పట్టించుకోకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతూ రాకపోకలు సాగించేవారు. ఏమాత్రం వర్షం పడిన వర్షపు నీరు మెయిన్ రోడ్డులో ఏర్పడిన గుమ్ములలో నీరు నిలిచిపోయి రహదారి గుండా వెళ్లాలంటే నరకాన్ని తలపించేది. పాదచారులు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇతర ప్రాంతాల నుండి పాచిపెంట వచ్చిన పలువురు రోడ్డు పరిస్థితిని చూసి హేళన చేసేవారు. పాచిపెంట మెయిన్ దుస్థితిపై ఎప్పటికప్పుడు పత్రికలు ఘోషించినా

పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు నుండి విమర్శలు వినిపించాయి. రెండు దశాబ్దాల క్రితం నిర్మాణం చేపట్టిన పాచిపెంట ప్రధాన రహదారి సిసి రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో నరకయాతన పడేవారు. అయితే ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని

పాచిపెంట సర్పంచ్ ప్రతినిధి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు చొరవతో రోడ్డు పనులను పూర్తి చేస్తున్నారు. హమ్మయ్య ఎన్నాళ్లకు పాచిపెంట మెయిన్‌రోడ్డు బాగుపడుతుందని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి పిన్నింటి ప్రసాద్ బాబు మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ నాయకులు దండి జగన్మోహన్మోహన్‌రావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.

సిబ్బందికి ప్రతినెలా వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్లు

- కొన్ని రోజులుగా శాంతియుతంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన
- పోరాటం చేస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయం
- అధికారుల తీరుపై ఏఐటీయూసీ మండిపాటు

విశాలాంధ్ర-బెలగాం : ప్రభుత్వ ఆసుపత్రులలో పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్ల బ్రతుకులు కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టడం వలన పెరిగిన వేతనాలు ఇవ్వకుండా, ప్రతి నెలా సక్రమంగా జీతాలు కూడా చెల్లించకుండా ఉండడంతో గత కొన్ని రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఎఐటియుసి పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ శనివారం స్థానిక జిల్లా ఆసుపత్రి వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో ఆసుపత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 3 నెలలుగా దశలవారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలిగించకుండా, పనులకు ఆటంకాలు కలిగించకుండా శాంతియుత పద్ధతిలో నిరసన ధర్నాలు చేస్తున్నప్పటికీ దీనిపై సంబంధిత జిల్లా అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. జిఓ వున్నప్పటికీ శ్రమకు తగిన జీతం ఇవ్వకపోగా ప్రతినెలా జీతాలు సకాలంలో ఇవ్వక నానా ఇబ్బందులూ పడుతున్నారని అన్నారు. వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విజయనగరం లేబర్ కమిషనర్ వద్ద జరిగిన సమావేశంలో కొద్దిరోజులు వాయిదా కోరారని చెప్పారు. అందువలన ఈనెల 30వ తేదీ నుండి జరగవలసిన శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులకు, సూపర్వైజర్లు సెప్టెంబర్ 5వ తేదీవరకు వాయిదా వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు అలజంగి కుమారమ్మా, ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ సూపర్ వైజర్లు, వర్కర్లు, ఎం. చంద్రమౌళి, బాలక్రిష్ణ, సుధీర్, కావ్య, రోషిణి, కుమారమ్మ, సత్యవతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

'పీఎం జుగా' వేదికను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పీఎం జుగా) కార్యక్రమాన్ని నిర్వహించుటకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. అక్టోబర్ 2వ తేదీన పీఎం జుగా మరియు పీఎం జన్ మన్ (ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమాల కొనసాగింపు ఏర్పాట్లపై ప్రధాన మంత్రి జార్కండ్‌లోని హజారీబాగ్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. పార్వతీపురంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్న దృష్ట్యా కార్యక్రమాన్ని పార్వతీపురం ఐటిడిఎ ప్రాంగణంలో నిర్వహించుటకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, సహాయ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ మురళీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

డైవర్షన్ పోలిటిక్స్ వద్దు... సిబిఐతో విచారణ జరిపించాలి

మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి

విశాలాంధ్ర-కురుపాం : కూటమి ప్రభుత్వం వందరోజులు పరిపాలన విఫలంపై ప్రజలు చర్చించకుండా ఉండేందుకు పవిత్రమైన తిరుపతి లడ్డు పై నెయ్యి కల్తీ ఆరోపణలు చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో డైవర్షన్ పోలిటిక్స్ చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సిబిఐ దర్యాప్తు నకు ఆదేశించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి శనివారం ఉదయం డిమాండ్ చేశారు.కస్పాగదబవలస వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వలన జరిగిన నష్టానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు కు ఎలాంటి హానీ జరగకుండా చూడాలని ప్రార్థనలు చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పరిపాలన ప్రారంభించిన మొదటి రోజు జూన్ 12 ఆర్డర్ చేస్తే జులై 14న నాలుగు ట్యాంకర్లు నెయ్యి ఎఆర్ కంపెనీ నెయ్యి తిరుమల కు పంపిస్తే అక్కడ నాణ్యత ప్రమాణాలు పరీక్షలు చేసి ఎన్ ఎబిఎల్ లో పరీక్షలు నిర్వహించి నాణ్యమైన నెయ్యి కాదని తిరిగి పంపినట్లు ఈఓ ప్రకటన చేశారని అన్నారు.ఇప్పుడు కూటమి నందిని నెయ్యి వాడేందుకు సిద్ధం కావడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని 2016-18మధ్య తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం హయాంలో నందిని నెయ్యి వాడి నాణ్యమైన నెయ్యి కాదని తిరిష్కరించి మళ్లీ ఇప్పుడు ఎలా సిద్ధపడుతోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తే డిక్లరేషన్ అడగటం వింతగా ఉందని వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి ఇద్దరూ పది సంవత్సరాల కాలం స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారని తిరుమల తిరుపతి దేవస్థానం లో గొప్ప సంస్కృతి సంప్రదాయాలు అమలు చేస్తే చంద్ర బాబు నాయుడు గతంలో వెయ్యి కాళ్ళ మంటపం కూల్చివేత కారకుడని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ హయాంలో వేద విశ్వవిద్యాలయం, కళ్యాణ మస్తు, క్యూ లైన్లలో వేచి ఉండే భక్తులు కు అన్న ప్రసాదం పంపిణీకి శ్రీకారం చుట్టారనిఅన్నారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుద్ధి ప్రసాదించాలని పూజలు నిర్వహించామని తెలిపారు..

మత విశ్వాసాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదు... రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల్లో మత విద్వేషం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఆలయాల సంప్రోక్షణ పేరుతో మెట్లు కు బొట్టు పెట్టే సమయం ఆంధ్రప్రదేశ్ ప్రజలు కష్టాలు గుర్తించి సమస్యలు పరిష్కారం చూపాలని కోరారు. విజయవాడ వరదల ప్రాంతంలో పర్యటించే ప్రయత్నం చేయని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆలయాలు ప్రదక్షిణలు లో బిజీగా ఉన్నారని తెలిపారు.ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ మహిళలు, విద్యార్థులు కు రక్షణ గా ఉంటానని చేసిన మాటలు ఇప్పుడు ఏమయ్యాయని విమర్శించారు.ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీ అమలు చేయడం పై ఎందుకు పవన్ కళ్యాణ్ మాట్లాడటం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వందరోజులు పరిపాలన లో తీవ్రంగా విఫలమైందని, సూపర్ సిక్స్ అమలు చేసే కనీస ఆలోచన ప్రభుత్వానికి లేదనే విమర్శలు ప్రజలు నుంచి తీవ్రంగా వినిపిస్తున్నాయని వాటి నుంచి ప్రజలు దృష్టి మరల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డైవర్షన్ పోలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు డబ్బు సంపాదనే ధ్యేయంగా, ఉద్యోగులను వేదింపులకు గురి చేస్తున్నారని ప్రజా సమస్యలు గాలికి వదిలేసారని అన్నారు.ఎంపీపీలు కుంబురుకు ధీనమయ్య, శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత, శశి కళా, ఐదు మండలాల కన్వీనర్లు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది... వందరోజుల ప్రజాపాలన అట్టర్ ఫ్లాప్

విశాలాంధ్రపార్వతీపురం టౌన్: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, వందరోజుల ప్రజా పాలన అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉపరాష్ట్రపతి పవన్ కళ్యాణ్ కు భగవంతుడు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, స్థానిక మాజీ శాసనసభ్యులు అలజంగి.జోగారావు అన్నారు.శనివారం తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని అసత్య ప్రచారం చేస్తూ అపచారానికి వడికట్టుకున్న చంద్రబాబుని శిక్షించాలని, ప్రజలను రక్షించాలని కోరుతూ స్థానిక శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తిరుపతి లడ్డూపై అసత్య ప్రచారం బెడిసి కొట్టడంతో, దాన్నుంచి డైవర్ట్ చేసేందుకు సీఎం చంద్రబాబు చేసిన మరో కుతంత్రమే తిరుమలలో జగన్‌మోహన్‌రెడ్డి డిక్లరేషన్ ఇవ్వాలనే కొత్త వాదన తీసుకువచ్చారని, కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ అవడంతో దానినుంచి ప్రజలను డైవర్షన్ చేసేందుకు చంద్రబాబు ఈ ఘోరానికి వదిగట్టారని, కూటమి ఇది మంచి ప్రభుత్వం అని ఇటీవల కార్యక్రమం చేపట్టగా అది చూసిన ప్రజలంతా ఇది ముంచే ప్రభుత్వం అని సూపర్ సిక్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చాకా తమని మోసం చేశారని యావత్ ప్రజానీకం చీదరించుకుంటున్నారని తెలిపారు. ప్రపంచంలోని భక్తులందరికీ ఎంతో ప్రీతికరమైన తిరుపతి లడ్డు విషయంలో చంద్రబాబు నాయుడు ఊసరవెల్లి మాదిరిగా రోజుకో అబద్ధపు ప్రచారాలు సాగిస్తున్నారని, రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోందని,దేవుడి దగ్గరకు వెళ్లే కార్యక్రమాన్ని కూడా అడ్డుకునే మనస్తత్వం మా రాజకీయ జీవితంలో ఏనాడూ చూడలేదన్నారు. ఇది రాక్షస పాలన కాదా అన్నారు. ముఖ్యమంత్రి రాక్షస పాలనను, తిరుపతి లడ్డుపై చంద్రబాబు నాయుడు చేస్తున్న అసత్య ప్రచారాలను రాష్ట్ర ప్రజలు, మేధావులు గ్రహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్పర్సన్, వైస్ చైర్మన్లు, మూడు మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు, వైసం పిపిలు, మాజీ ఏఎంసీ చైర్పర్సన్, మూడు మండలాలు మరియు పట్టణ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మాజీ స్టేట్ డైరెక్టర్లు, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు, మాజీ పిఎసిఎస్ చైర్మన్లు డైరెక్టర్లు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారుదలు పాల్గొన్నారు.

ఈనెల 22తో ముగిసిన బదిలీల పర్వం

ఇంతవరకు జిల్లా పరిషత్ ఉద్యోగులకు అందని బదిలీ ఉత్తర్వులు

విశాలాంధ్ర-పార్వతీపురం : రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచిన తర్వాత వివిధ పథకాలు పెద్దఎత్తున అమలు చేస్తుండగా ఉద్యోగులు దానిలో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో ఉద్యోగుల బదిలీలకు కూడా ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో వారిలో ఆనందం కలిగింది. బదిలీల గడువును మూడుసార్లు వాయిదావేసి చివరకు ఈనెల 22తో బదిలీలు గడువు ముగిసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈసందర్భంగా జిల్లా అధికారులకు కూడా పెద్దఎత్తున బదిలీలు జరిగిన సంగతి కూడా తెలిసిందే. జిల్లాలోని రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, జిల్లా పరిషత్ తదితర శాఖలకు సంబంధించి బదిలీలు పెద్ద ఎత్తున జరిగాయి. జిల్లా పరిషత్ బదిలీల్లో కీలకమైన ఎంపీడీవోలు, పరిపాలన అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు బదిలీలకు సంబంధించి ఇంతవరకు ఉత్తర్వులు వెలువడక పోవడం గమనార్హం. ఇదిగో అదిగో అంటూ గత వారం రోజులుగా జిల్లా పరిషత్ చుట్టూ ఉద్యోగులు తిరుగుతున్నారు తప్ప వారికి ఉత్తర్వులు అందించే దాఖలాలు కనిపించలేదు. ప్రభుత్వం ప్రకటించిన బదిలీల గడువు ముగిసినప్పటికీ ఉత్తర్వులు అందచేయక పోవడంలో ఉన్న అంతర్యం ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదు. ఇదిలాఉండగా బదిలీలు జరిగిన ఉద్యోగులను రిలీవ్ కావద్దని, పెన్షన్ పంపిణీ, స్వచ్ఛత హీ సేవ, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాల దృష్ట్యా అక్టోబర్ 2 వరకు కొనసాగి ఆరోజున రిలీవ్ కావాలని ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో బదిలీ అయిన ఉద్యోగులు కూడా రిలీవ్ కాకపోగా, తమకు బదిలీ జరిగిందా లేదా అన్నది జిల్లా పరిషత్ శాఖలో ఉన్న ఎంపీడీవోలకు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్లకు తదితర కేడర్ ఉద్యోగులకు తెలియకపోవడంతో ఉత్కంఠతో వారంతా ఎదురు చూస్తున్నారు. బదిలీల గడువు ముగిసినప్పటికీ తమ బదిలీ ఉత్తర్వుల వివరాలు ఇప్పటికైనా తెలియజేస్తే తాముకూడా సంతోషించి ఇతర ఉద్యోగుల తరహాలో తాముకూడా అక్టోబర్-2 తర్వాతనే రిలీవ్ అవుతామని వారు తెలియజేస్తున్నారు. జిల్లా పరిషత్ చరిత్రలో ఎప్పుడు కూడా బదిలీల పర్వము ఇలా ఇంత ఉత్కంఠ బరితముగా జరగడం చూడలేదని జిల్లా పరిషత్తు ఉద్యోగులలో ఎంపీడీవోలు సీనియర్ అసిస్టెంట్లు పలువురు తెలియజేయడం గమనార్హం. తమకు బదిలీలు చేసిన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి జిల్లా నుండి రిలీవ్ అయ్యారుకానీ, తమకు మాత్రం బదిలీ ఉత్తర్వులు అందలేదని జిల్లా పరిషత్ శాఖ ఉద్యోగులు వాపోతున్నారు.

మా ప్రాణాలతో చెలగాటమాడుతారా..?

నగర పంచాయతీని ముట్టడించిన కౌన్సిలర్లు భారీ ధర్నా

విశాలాంధ్ర-పాలకొండ : మా ప్రాణాలతో, జీవితాలతో చెలగాటమాడుతారా... అని శనివారం పాలకొండ నగర పంచాయతీ పరిధి 13 15 16 వార్డుల కౌన్సిలర్స్, భాసూరు కాంతారావు, తుమ్మగుంట శంకర్రావు(ప్రతినిధి) కడగల వెంకటరమణ, అనురాధ (ప్రతినిధి) పాలకొండ నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. గత 15 ఏళ్లుగా నగర పంచాయతీలో డంపింగ్ యార్డ్ సమస్యతో పాలకొండ పట్టణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. తాజాగా 20 వార్డులకు సంబంధించి ఒక రోజుకు 15 టన్నులు సేకరిస్తున్న చెత్తను నగర పంచాయతీ ఎదురుగా పట్టణ నడిబొడ్డున స్టాక్ పాయింట్‌గా వేసి ఈ మూడు వార్డుల ప్రజలకు తీవ్రమైన అనారోగ్యస్త్ర పాలు చేస్తున్నారని మూడు వార్డుల ప్రజాప్రతినిధులతో ఆవార్డు ప్రజలతో, మహిళలతో డంపింగ్ యార్డ్‌ను తొలగించాలనే నినాదాలతో నగర పంచాయతీ ప్రాంగణం మారు మ్రోగింది సంత మార్కెట్లో ఉన్న చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని, పాలకొండ పట్టణానికి ఎన్నో ఏళ్లుగా పట్టిపీడిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఒకానొక పరిస్థితులలో యుద్ధ వాతావరణం తలపించింది సిఐ ఎం చంద్రమౌళి ఎస్సై ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో ఆందోళనకారులను శాంతింప చేసేందుకు ప్రయత్నించారు, నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై మేము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు చెప్పేందుకు ప్రయత్నం చేశారు విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టిడిపి అగ్ర నాయకులు మాజీ చైర్పర్సన్ ప్రతినిధి పల్ల కొండబాబు, చైర్‌పర్సన్ ఎదవ రాధాకుమారి, మూడు వార్డుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను అడిగి తెలుసు కున్నారు. డంపింగ్ యార్డ్ సమస్య గత కొన్ని సంవత్సరాలుగా పాలకొండ పట్టణాన్ని పిడిస్తుందని మనందరికీ తెలిసిన విషయమేనని, ఈ సమస్యను పరిష్కరించేందుకు పార్టీలక తీతంగా చర్యలు తీసుకుంటామని ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే మేము ఇక్కడ ఉన్నామని స్పష్టం చేశారు అలాగే సంత మార్కెట్లో ఉన్న చెత్తను రెండు రోజుల్లో తొలగిస్తామని హామీ ఇచ్చారు ఈ ధర్నా కార్యక్రమాల్లో వైకాపా పట్టణ అధ్యక్షుడు ఐదవ వార్డ్ కౌన్సిలర్ వెలమల మన్మధరావు టిడిపి టౌన్ పార్టీ అధ్యక్షుడు,కౌన్సిల్ ప్రతినిధి గంట సంతోష్,ప్రజా నాయకులు కార్మికుల ప్రతినిధి దావాల రమణారావు జిల్లా నాయకులు తిరుపతిరావు మూడు వార్డుల ప్రజలు మహిళలు మార్కెట్లో ఉన్నటువంటి వ్యాపారస్తులు తదితరులు ఉన్నారు.

లడ్డూ ప్రతిష్ట దిగజార్చింది కూటమి ప్రభుత్వమే : వైసీపీ నిరసన

విశాలాంధ్ర-కూనవరం : తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదానికి ఉన్న విశిష్టతను దిగదర్చే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు స్థానిక వైసిపి కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల మరియాదాసు ఎంపీపీ పాయం రంగమ్మ జడ్పిటిసి గుజ్జ విజయ ఆలూరి కోటయ్య మాట్లాడుతూ రాష్ట్రం వర్షాలు, వరదలు, పంటనష్టం, ఆస్తినష్టం, పెరిగిన నిత్యావసరధరల తో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తమ వందరోజుల ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండేందుకు లడ్డు డ్రామాని తెరపైకి తెచ్చారని విమర్శించారు.నిజంగానే లడ్డూలో కల్తీ జరిగితే ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దలు తలుచుకుంటే నిజానిజాలు నెగ్గ తేలాల్సిందిపోయి, మాలలు వేసుకొని, ప్రాయశ్చిత్త దీక్షలు చేస్తూ, ప్రజల దృష్టి మరలుస్తున్నారని అన్నారు. వందరోజుల పేలవ పరిపాలనతో కూటమి ప్రభుత్వంలో పసలేదని ప్రజలకు అర్థం అయిపోయిందని దాన్ని కప్పిపుచ్చుకునేందుకు లడ్డు ప్రసాదం వివాదాన్ని సినిమా తారల వ్యాఖ్యలతో ముడిపెట్టి మరీ జాతీయస్థాయిలో రక్తి కట్టించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తాపత్రయపడుతున్నారని అన్నారు.నిజం నిలకడ మీద తెలుస్తుందని తమ నాయకుడు జగన్ మీద నిరాధారమైన నిందలు వేసినా ప్రజలు నమ్మరని అన్నారు. కూనవరంలో ర్యాలీ అనంతరం శ్రీ రామగిరి లోని సీతారామ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గుజ్జ విజయ ఎంపీపీ పాయం రంగమ్మ కొమ్మని మోహన్ రావు ఎలిపే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మన ఇళ్ళు-మన గౌరవంపై అవగాహన

విశాలాంధ్ర-సీతానగరం : ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మనఇళ్ళు మన గౌరవం కార్యక్రమంపై అవగాహన పొంది ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎం వి కరుణాకర్ పిలుపునిచ్చారు శనివారం నాడు స్థానిక హౌసింగ్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మన ఇళ్ళు మన గౌరవం కార్యక్రమం క్రింద ఇప్పటికే మంజూరు చేసిన ఇళ్ళను లబ్ధిదారులు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెల లోగా పూర్తి చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి నెల లోగా నిర్మాణం పూర్తి చేయకపోతే గృహ నిర్మాణం పథకం కింద మంజూరయిన ఇళ్ల రద్దు కాగలదని ఆయన చెప్పారు. యూనిట్ ధర రూ.1.80 లక్షలుతో పాటు స్వయం సహాయక సభ్యులకు రూ.30 వేలు రుణం లభిస్తుందని ఆయన తెలిపారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయుటకు అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది నాయకులు ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఈఈ రత్నకుమార్, ఏఈ జానకిరామ్, వెలుగు ఏపిఎం శ్రీరాములు నాయుడు,నాయకులు సాలహరి గోపాల్, గరికయ్య, అరవింద్ కుమార్, సబ్బాన శ్రీను,బుడితి శ్రీను, బలరాం,జగన్నాథం నాయుడు, బూరాడ చిరంజీవి, మీసాల వెంకట రమణ, శ్రీనివాసరావు తదితరులతోపాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

30న సాలూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం సాలూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం ప్రకటన విడుదల చేశారు. సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలనుండి నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలు స్వయంగా వచ్చి తెలపవచ్చని ఆయన చెప్పారు. జిల్లాఅధికారులు అందరూ సాలూరులో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోనేది లేదు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదని హిందూ చైతన్య వేదిక సభ్యులు హెచ్చరించారు. తిరుపతి లడ్డు పై రాజకీయం చేయడం తగదని నిరసిస్తూ శనివారం పట్టణంలో హిందు చైతన్య వేదిక ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసి స్థానిక శ్రీవెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరమ పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలువైయున్న తిరుమలలో శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీచేసి భక్తుల హృదయాలను, మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించే తీరు అన్యాయమన్నారు. ఇకముందు ఇటువంటి హిందువుల మనోభావాలను కించపరుస్తూ ఎవరు ఎంటువంటి దుర్భాషలాడినవారిపై వెంటనే చట్టరీత్యా తగు చర్యలు జరిపి శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక సభ్యులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాప ప్రక్షాళన కోసం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-సాలూరు: తిరుమల లడ్డూ పరువు ప్రతిష్టను తన వాఖ్యలతో చంద్రబాబు దిగజార్చారని వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్ అన్నారు. శనివారం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళించి మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ మండలంలో మామిడిపల్లి గ్రామంలో ఉన్న గిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. లడ్డూ వివాదాన్ని సృష్టించి మతరాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు.విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం సరి కాదన్నారు. లడ్డూకి వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని జూలైలో శాంపిల్ రిపోర్ట్ వస్తే జూలైలో వెల్లడించకుండా సెప్టెంబరు లో బహిర్గతం చేయడం అంటే విఫలమైన వందరోజుల పాలన నుండి ప్రజల దృష్టి మరల్చడానికే అని అర్ధమవుతుందన్నారు.ఈ కార్యక్రమం లో ఆయనతో పాటు గ్రామ సర్పంచ్ సువ్వాడ శశికళ, వైకాపా నాయకులు దండిశ్రీను,సువ్వాడ రామకృష్ణ, తోణాం సర్పంచ్ ముప్పల ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.

మనఇళ్లు మన గౌరవం కార్యక్రమంలో ఎమ్మెల్యే జగదీశ్వరి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చెప్పినట్టు సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనేది మా ప్రభుత్వ నినాదమని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందని కురుపాం శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం మండలంలోని కన్నపుదొర వలస పంచాయతీలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన జరిగిన మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఎన్టీఆర్ గృహాల బిల్లులు ఆపేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా చేశారని గుర్తు చేశారు. అటువంటి కక్షపూరిత ప్రభుత్వంమాది కాదని, ఏపార్టీ వ్యక్తయినా మాకు పట్టింపు లేదని, పథకానికి అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, టీడీపీ అరకు పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, జనసేన పార్టీ కురుపాం నియోజకవర్గ ఇంచార్జ్ కద్రక మల్లేశ్వరరావు, టీడీపీ నాయకులు మండల కన్వీనర్ పల్ల రాంబాబు మూడడ్ల సత్యంనాయుడు జోగి భుజంగ రావు దాసరి రామారావు కృష్ణబాబు గురాన శ్రీరామమూర్తి నాయుడు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పల్లి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తులసిపాక పిహెచ్‌సి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులు

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్రంపేట కస్తూరిబాయి స్కూల్‌లో వైద్య సిబ్బంది హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాల్లో కొంతమంది విద్యార్థులు అనీమియా రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందని వైద్య అధికారి తెలియజేశారు. అలాగే కొంతమంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు టెస్టులు చేసి మందులు ఇచ్చారు. జ్వరంతో ఉన్న విద్యార్థులను ఏరియా హాస్పిటల్ చింతూరుకు రిఫర్ చేశారు, ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి పిల్లలకు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, చేతులను పరిశుభ్రంగా తెలుసుకోవాలని, అలాగే ఎలర్జీ ఉన్నవారు ఒకరి దుస్తులు మరొకరు వేసుకోకూడదని, ఎవరు దుప్పటి, టవళ్లు, సబ్బులు వారే వాడుకోవాలని సూచించారు. కొంతమంది విద్యార్థులకు గొంతు నొప్పి వాపు ఉండడం జరుగుతుందని, వేడి చేసిన నీళ్లు ఉప్పు కలుపుకొని నోటిలో పోసుకుని పుక్కిలించి ఉయ్యాలని. అలాగే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి ఆహారం ఎక్కువగా తీసుకోవాలని ముఖ్యమైన సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే కంటికి సంబంధించిన ఆప్తాల్మిక్ కిషోర్ ఐ స్క్రీనింగ్ కూడా చూడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎంపిహెచ్‌సిఓ సిహెచ్ వెంకటేశ్వరరావు, హెచ్‌వి పి.సరోజినీ, గంగరాజు. ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగును పెంచుకోవాలి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని పెదతొలుమండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతోజిల్లేడు ద్రావణం తయారీ చేయించి అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఎన్ ఎఫ్ ఏ జి. అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రకృతికి వినాశనం చేసే ఏవిధమైన రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజ సిద్ధంగా లభించే వనరులను ఉపయోగించుకోవాలని తెలిపారు. అప్పుడు ప్రకృతిని కాపాడుకోవడంతోపాటు, ప్రకృతి లోని సకల జీవరాశులు ఆరోగ్యకరంగా వుంటాయని, రైతులు పెట్టుబడులు తగ్గించి, దిగుబడులు పెంచే దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయవలసిన అవసరం ఉందని,వరి పత్తి కూరగాయలుమొదలగు పంటలకు అవసరమైన సూక్ష్మ స్థూల పోషకాలు సమృద్ధిగా లభించాలన్న, పొటాషియం లభించాలన్నా జిల్లేడు ద్రావణం పిచికారి చేసుకోవాలని సూచించారు. రైతులకు ఖర్చు లేకుండా ఉంటుందని, ఒక డ్రమ్ములో 200 లీటర్లనీటిలో, 20 కేజీలు జిల్లేడు ఆకులు గుండ చేసి, 10 లీటర్ల ఆవు మూత్రం వేసుకుని వారం రోజులుపాటు మురగ బెట్టిన తరువాత, 1ట్యాంక్ నీటిలో, 2 లీటర్ల జిల్లేడు ద్రావణం వేసుకోవాలని. మొక్క పెరుగుదలకు ఉపయోగ పడుతుందని, రైతులు అందరూ కలిసి సుమారు 300లీటర్ల కషాయం తయారుచేసుకోవటం జరిగింది. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం వలన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించడం జరిగినది. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆరిక చలపతిరావు, రైతులు కొండగొర్రి మౌళేశ్వరరావు, హిమరిక శంకర, మోహన్‌రావు, తేజేశ్వరరావు, సిబ్బంది అల్లు సూర్యనారాయణ, మోహన్‌దాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని శంబర గ్రామంలో ఎన్ఎఫ్ఏలు రొంగలి శ్రీనివాసరావు, సీహెచ్. శారదల ఆధ్వర్యంలో రసాయనక ఎరువులు పురుగు మందులు వాడుతున్న రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పై అవగాహన కల్పించడం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను, ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో రక రకాల వ్యాధులు వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణం మనం తినే ఆహారమే కారణమని అన్నారు. అందుకే మనమంతా ప్రకృతి వ్యవసాయం చెయ్యాలని, ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల గాలి, నీరు, భూమి, వాతావరణం కలుషితం కాకుండా ఉంటుందని, మన పిల్లలకు మంచి భూమిని, మంచి వాతావరణాన్ని ఆహారంను అందించవచ్చన్నారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయమే మనకు జీవనాధారమని అన్నారు. పురుగులు, తెగుళ్లు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా రైతుల సమక్షంలో జిల్లేడు ద్రావణం తయారు చేసి, దాని ఉపయోగాలు తెలియజేసారు. ఎటువంటి ఖర్చు లేకుండా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. గ్రామంలో రైతులందరు ప్రకృతి వ్యవసాయంపై ఆశక్తి చూపి, ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జిలు ఉర్లక నాగార్జున, శ్రీధర్, ఐసీఆర్పీలు రెడ్డి సుందరరావు, దీసరి వెంకటరావు, సీదరపు పాపారావు, కొండతామర అప్పలరాజు, చింతాడ లక్ష్మణ, రైతులు పాల్గొన్నారు.

'మన ఇల్లు మన గౌరవం'పై అవగాహన

విశాలాంధ్ర-మక్కువ : మక్కువ మండలంలో చెముడు గ్రామ పంచాయతీలో సెప్టెంబర్ 28 శనివారం చెముడు సర్పంచ్ బొంగు రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో మన ఇల్లు మన గౌరవం అవగాహన కార్యక్రమంలో నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా ఇల్లు పూర్తి చేయనటువంటి లబ్ధిదారులకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది గృహ నిర్మాణం కొరకు ఇంటిసామగ్రి అందిస్తామని స్టీల్ గాని సిమెంట్ గాని ఇంటి బిల్లులు చెల్లింపు కాని వాళ్ళకి త్వరగా చేస్తామన్నారు. హౌస్ లేఅవుట్ పరిశీలించారు ఆదేశించారు తెలియజేయడమైనది ఈ సమావేశంలో చెముడు సర్పంచ్ బొంగు రాజేశ్వరమ్మ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాల్‌నాయుడు ఎంపీటీసీ చింతల గోపాలకృష్ణ మండల హౌసింగ్ ఏఈ సింహాచలం ఎంఈఓ-1 సత్యనారాయణ ఎంఈఓ 2 ఏబీఎన్ ఏపీవో సచివాల సిబ్బంది పంచాయతీ కార్యదర్శి వైఎస్ఆర్సిపి బొంగు భీమలింగేశ్వరరావు టిడిపి జి.భూషణ్‌రావు, ఎ.రాము జి.కేశవ కారణం తిరుపతిరావు ఇతర సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మరిపివలసలో అంగన్వాడీలో పోషకాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర-మక్కువ : మండలంలో సంబర సెక్టార్‌లోని, మరిపివలస గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ లో పోషకాహార మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ బెల్లాన కృష్ణమూర్తి అధ్యక్షతన సామూహిక శ్రీమంతాలు జరిపించడం జరిగింది. అలాగే పౌష్టికాహారం ప్రాముఖ్యత, ఆవశ్యకత కోసం గర్భిణీ, బాలింతలకి తెలియజేయడం జరిగింది. అలాగే వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత కోసం అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీఓ బి.అనంతలక్ష్మీ, స్కూల్ హెచ్ఎం పోలినాయుడు సూపర్ వైజర్స్ఎన్ లావతి, పి రాజశ్రీ మరియు సచివాలయ సిబ్బంది, సంబర సెక్టార్ పరిధిలో గల అంగన్వాడీ వర్కర్స్, గ్రామంలోని గర్భిణీ, బాలింతలు హాజరయ్యారు.

టోకురు మన ఇల్లు మన గౌరవం గ్రామసభ

విశాలాంధ్ర-అనంతగిరి : టోకూరు పంచాయతీలో మన ఇళ్ల మన గౌరవం గ్రామ సభ సర్పంచ్ కిల్లో మోస్య అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ మాట్లాడుతూ పాత కొత్తగా మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని కాల యాపన్న చెయ్యకుండా వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గెమ్మెల నర్సన్న మాజీ సర్పంచ్ సారా దొన్ను వార్డు సభ్యులు గుజ్జెల పద్మ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ శంకర్ సచివాలయ సిబ్బంది మాజీ వార్డు సభ్యులు గుజ్జెల గురుమూర్తి సోమన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-పార్వతీపురం: హైకోర్టు ఫోర్టు పోలియో న్యాయమూర్తులు టి.రాజశేఖర్ రావు, ఎస్.సుబ్బారెడ్డి లు పార్వతీపురం విచ్చేసిన సందర్భంగా వారిని పార్వతీపురం జిల్లా కోర్టులో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేసారు. అనంతరం న్యాయమూర్తులతో సమావేశమై పెండింగ్ కేసుల గురించి చర్చించి తగ్గించడానికి న్యాయ శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలని న్యాయమూర్తులు జిల్లా ఎస్పీకి సూచించారు.

పరిశుభ్రతే భవితకు పునాది : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : పరిశుభ్రతే భవితకు పునాధని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. మనతో పాటు మన చుట్టూ ప్రక్కల కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వీధుల్లో, వార్డులో, కాలువల్లో చెత్త పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకునే భాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందని, వాటి వాడకం వల్ల రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతీ ప్లాస్టిక్ రహిత సమాజన్ని సృష్టించడానికి అధికారులకు సహాయపడాలని కోరారు. పొడి చెత్త-తడి చెత్త ను వేరువేరు పురపాలక సిబ్బందికి అందజేయా లన్నారు. అధికారుల పర్యవేక్షణ ఎల్లపుడు ఉంటుందని వారి విధులకు ఆటంకం కలిగించకుండా సహకరించాలన్నారు. స్వచ్ఛతా హీ సేవా 12వరోజు కార్యక్రమంలో భాగంగా శనివారంనాడు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ లో చెత్త నుండి సంపద సృష్టితయారీపై ప్రజల్లో అవగాహనా కల్పించారు. వీధుల్లో ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బంది రిక్షాలు,ట్రాక్టర్ లో ఎక్కించి డంపింగ్ యార్డ్ కు తరలించారు. నేడు అన్ని గ్రామపంచాయతీలో చెత్త సంపద కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు.

పాత్రికేయుడు గోపి కుటుంబాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి పరామర్శ

విశాలాంధ్ర-కురుపాం : పాత్రికేయుడు చిప్పాడ గోపి తల్లి తండ్రులు ఇరవై రోజుల వ్యవధిలో అనారోగ్యం తో చనిపోయిన విషయం తెలుసుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి శనివారం సాయంత్రం కురుపాం గోపి ఇంటికి వెళ్ళి పరామర్శించారు.మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.ఎంపీపీ శెట్టి పద్మావతి, సర్పంచ్ సుజాత, జడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీ సభ్యుడు బంగారు నాయుడు, నాయకులు ఆదిల్, నాగేశ్వరరావు, గొల్ల తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో భగత్‌సింగ్ పోరాటం కీలకం

విశాలాంధ్ర-పాలకొండ: స్వాతంత్ర పోరాటంలో అగ్గి బావుటాల బ్రిటిష్ సైన్యాలను ఎదురొడ్డిన దీసాలి భగత్‌సింగ్ వెంకంపేట ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.పరాంకుశం నాయుడు తెలిపారు. స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని శనివారం పాఠశాలలో నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో భగత్‌సింగ్‌పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ప్రజల్లో స్వాతంత్ర కాంక్షను రగిలించి చిన్నతనంలోనే ఉరికంబాన్ని ముద్దాడి భరతమాత కోసం ప్రాణాలను తునప్రాయంగా అర్పించిన ధీరుడు అన్నారు. భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్‌లకి ప్రతిభారతీయుడు జీవితాంతం రుణపడి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. దేశభక్తికి త్యాగస్ఫూర్తికి ప్రతిరూపంగా వీరు నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు భగత్‌సింగ్ జీవిత విషయాలను తెలియజేశారు.

డీఎస్పీని కలిసిన బికే మూర్తి

విశాలాంధ్ర-పాలకొండ : డిఎస్పి ఎం రాంబాబును శనివారం ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రెటరీ భాసూరు కృష్ణమూర్తి గౌరవప్రదంగా కలిసి మెమెంటో అందజేసి సత్కరించారు.

30న జరిగే శిక్షణకు హాజరు కావాలి

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : అరకులోయ నియోకవర్గ కేంద్రంలో ఈనెల 30న శిక్షణకు హాజరు కావాలని టిడిపి మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు తెలిపారు. బూత్, యూనిట్ ఇన్చార్జిలకు ప్రత్యేకంగా శిక్షణ ఉంటుందన్నారు. ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల చెంతకు చేరే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. నియోకవర్గ కేంద్రంగా జరిగే శిక్షణలో బూత్, యూనిట్ ఇన్చార్జిలతోపాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సిట్‌తో కాదు... సిబిఐతో విచారణ జరిపించాలి

చంద్రబాబు పాప ప్రక్షాళన కోసం ప్రత్యేక పూజలు
మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర-సాలూరు : చంద్రబాబు పాప ప్రక్షాళన కోసం రాష్ట్ర వ్యాప్తంగా పూజలు నిర్వహింఎవమని వైకాపా అధినాయకత్వం పిలుపుమేరకు సాలూరులో కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించామని మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర చెప్పారు. పార్టీ ముఖ్య నాయకులతో కలసి పూజలు నిర్వహించిన అనంతరం తన నివాసంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడటం సరికాదన్నారు. తిరుమల పవిత్రతను, లడ్డూ ప్రతిష్టను చంద్రబాబు బజారుకీడ్చారన్నారు. వంద రోజుల పాలనలో విఫలమైన తేదాపా ప్రభుత్వం ప్రజల దృష్టి మరల్చడానికే గత ప్రభుత్వ హయాంలో లడ్డూకి ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపిస్తున్నారన్నారు. నిజాలు నిగ్గుతేల్చేందుకు సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జ్ లేదా సిబిఐతో విచారణ జరిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెయ్యిలో కల్తీ జరిగిందని ఆరోపిస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో పాలకవర్గానికి లోబడి పనిచేసే సిట్ సంస్థ దర్యాప్తులో నిజాలు బహిర్గతం కావన్నారు. సిబిఐతో విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని హిందువుగా డిమాండ్ చేస్తున్నానన్నారు. భారతదేశం లౌకిక దేశమని రాజ్యాంగ పీఠికలో లిఖించబడిందన్నారు. లౌకికదేశంలో రాజ్యాంగ బద్ధ ప్రమాణం చేసి పదవులలో ఉన్నవారెవరూ ఒకమతానికి వత్తాసు పలుకుతూ ప్రకటనలు చేయరాదన్నారు. అలా చేసినవారు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని తెలిపారు. వారంతా తమ పదవులకు రాజీనామా చేయా లని డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అత్యధిక భక్తులు కలిగిన కలియుగదైవం వెంకటేశ్వర స్వామిని రాజకీయాలకోసం చంద్రబాబు వాడుకోవడం సరికాదన్నారు. అన్యమతస్తులు తిరుమల దర్శనానికి వెళ్లినప్పుడు ఖచ్చితంగా ఒకసారి డిక్లరేషన్ సమర్పించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర ముగిసిన తరువాత 2017లో కాలినడకన మెట్లమార్గంలో తిరుమల చేరుకొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారన్నారు. అప్పుడు తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. నాడు అడగని డిక్లరేషన్ నేడు ఎందుకు అడుగుతున్నారంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఐదుసార్లు తిరుమలను జగన్మోహన్‌రెడ్డి దర్శించు కున్నారన్నారు. అటువంటి వ్యక్తిని ఇప్పుడు డిక్లరేషన్ అడగటం చూస్తుంటే కూటమి ప్రభుత్వం మత రాజకీయం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. మత రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వైకాపా పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గిరిరఘు, వైకాపా సాలూరు, పాచిపెంట మండల అధ్యక్షులు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, గొట్టాపు ముత్యాలనాయుడు వైకాపా సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మువ్వల ఆదయ్య, బంకురు తిరుపతి, లక్ష్మణ, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వ కక్షపూరిత విధానాలను ప్రజలు గమనిస్తున్నారు

- మూడేళ్ల పదవీకాలంలో జడ్పిటిసి, ఎంపీటీసీలుగా ప్రజలకు సేవలు అందించడం సంతృప్తినిచ్చింది
- ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచి మూడేళ్ల పూర్తి చేసుకోవడం సంతృప్తిని కలిగించిందని, మిగిలిన రెండేళ్ల పదవీకాలంలోనూ తమను నమ్ముకున్న ప్రజలకు అన్ని విధాల అభివృద్ధి, సంక్షేమాలు చేరువ చేసేందుకు కృషి చేస్తామని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. ఎంపీటీసీలుగా గెలిచి మూడేళ్ల పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఎంపీపీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన ఎంపీటీసీలతో కలసి ఆమె కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీలు మాట్లాడుతూ వైకాపా పరిపాలన సమయంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలో ప్రజలు జడ్పిటిసి సహా అధిక స్థానాలలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లుగా వైకాపాకు చెందిన వారినే గెలిపించు కున్నారన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గడచిన మూడేళ్ల సుపరిపాలన అందించామన్నారు. అనునిత్యం ప్రజా సమస్యలపై ఆలోచన చేయడమే గాక ఈ ప్రాంత అభివృద్ధిపై ఎప్పటికప్పుడు ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ లతోపాటు ఉన్నతాధికారులతో సమీక్షించి మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. తమకున్న మిగిలిన రెండేళ్ల పదవీకాలంలోనూ మన్యప్రాంత అభివృద్ధికి, తమను నమ్మి గెలిపించిన ప్రజలకు మరింత చిత్తశుద్ధితో సేవలందిస్తామన్నారు. నేటి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు సాధ్యం కానీ హామీలను గుప్పించి అధికారంలోకి రావడమే గాక వంద రోజులు పూర్తి అయినప్పటికీ ఇచ్చిన హామీలను విస్మరించి నేడు మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజులలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం అంటూ ప్రచారం చేసిన తెదేపా అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినప్పటికీ సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా నేడు " మంచి ప్రభుత్వం " అని కార్యక్రమాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. మూడు పార్టీలు ఏకమైన ఈ ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలను ముంచే ప్రభుత్వం తప్ప మంచి ప్రభుత్వం కాదన్నారు. ఆశ్రమ వసతి గృహాలలో విద్యార్థులకు జరిగిన ప్రాణ నష్టంలోనూ, ప్రకృతి విపత్తులోనూ, మైదాన ప్రాంత బాధితులకు మన్యప్రాంత నష్టపరిహారం అందించడంలో ఎన్డీఏ ప్రభుత్వం వివక్ష చూపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇటువంటి విధానాలను మానుకోకపోతే ఎన్డీఏ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు జోష్యం చెప్పారు.

కొనసాగుతున్న స్వచ్ఛహిసేవా, మన మంచి ప్రభుత్వ కార్యక్రమాలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని 35 గ్రామపంచాయతీలో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛత హిసేవా కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర 2047, క్యూ ఆర్ కోడ్ తదితర కార్యక్రమాలను ముమ్మరంగానిర్వహిస్తున్నారు. వాటి వివరాలను సకాలంలో అప్లోడ్ చేస్తున్నారు. శనివారం నాడు మండలంలోని చెత్త సంపద కేంద్రాలను పునరుద్ధరించే కార్యక్రమాలు తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి చెత్తసంపద కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాలతో పాటు, జిల్లా గ్రామపంచాయతీ అధికారి రామచంద్రరావు ఆదేశాలు సూచనలు మేరకు కార్యక్రమంలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచులు, టీడీపి నాయకులు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తిరుపతిరావు, మనోహర్, పీటర్ పాల్, శ్రీనివాసరావులు, శశిభూషణరావు, మురళి, సంతోష్ కుమార్, కామేశ్వరరావు, రమేష్, సుధారాణి, పై.సౌజన్య, ధనలక్ష్మి, గౌరేశ్వరి, వెంకటనాయుడు, మోహనరావు, పద్మావతి, గౌతమి, రజిని, జెరూష, అశోక్, రోహిణి, సాయి ప్రియాంక,పైడిరాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: మండలంలోని ఖంద్రుమ్ పంచాయతీలో స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి ఆధ్వర్యంలో శనివారం మన ఇల్లు మన గౌరవ కార్యక్రమం నిర్వహించారు. ఆ పంచాయతీలో 134 మంది గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు పంచాయతీ గ్రామ సభలో గృహ నిర్మాణ పథకం పై లబ్దిదారులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు కంద్రుమ్ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలన్ని కలిపి కంద్రుమ్ అంగన్వాడీ కేంద్రంలోపౌష్టికాహారం మాసోత్సవ కార్యక్రమంలో గర్భిణి స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహార లోపం వల్ల జరిగే నష్టాన్ని గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, మాజీ సర్పంచ్ కిలో ఆనంద్, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, అంగన్వాడీ సూపర్వైజర్, వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టోకూరు బాలికల పాఠశాలలో మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-అనంతగిరి : అనంతగిరి మండలం టోకురు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇటివల కాలంలో సూకురు అప్పలకొండ మరణించిన తర్వాత అధైర్య పడుతూ జ్వరాల బారిన పడి భయపడుతున్న విషయంపైఆరోగ్య శాఖ వైద్యాధికారి శ్రీ జమల్ భాషాకి అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు పిర్యాదు చేయడంతో జిల్లా వైద్యాధికారి డి.ఎమ్.ఎండ్.హెచ్.ఒ డాక్టర్ జమల్ భాషా పర్యవేక్షణలో అరకు ఏరియా ఆసుపత్రి డాక్టర్ హరి, అనంతగిరి పి.హెచ్.సి డాక్టర్ జ్ఞానేశ్వరి మెడికల్ కేంప్ పెట్టి వైద్యం అందించారు. ఈ సందర్భంగా డి.ఎమ్.ఎండ్.హెచ్.ఒ డాక్టర్ జమల్ భాషా విద్యార్థిని లకు మనోధైర్యం కల్పిస్తూ దైర్యంగా ఉండండి అధైర్య పడవద్దు మేము మీకు వైద్యం చేస్తున్నాము, జ్వరాల తీవ్రత తగ్గేదాక 3 రోజులకు,వారం రోజులకు ఒకసారి మెడికల్ కేంపులు నిర్వహిస్తుంటాము వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసర పరిశుభ్రత జాగ్రత్తలు తీసుకుంటు వేడి నీరు త్రాగుతూ కొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినిలు లేచి మాకు ఎ.ఎన్.ఎమ్.కావలని కోరారు.ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని జ్వరాల తీవ్రత తగ్గేదాక అనంతగిరి పి.హెచ్.సి.టోకురు పంచాయితీ ఎ.ఎన్.ఎమ్.పాఠశాలలో అందుబాటులో ఉండాలని జమల్ భాషా దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగింది. ఈకార్యక్రమంలో సర్పంచ్ కిలో మోసియా సూపర్ ఎంపీటీసీ సారా దున్నువై సర్పంచ్ గమ్మిల నర్సన్న వార్డు సభ్యులు గుజ్జులు గురుమూర్తి ప్రధానోపాధ్యాయురాలు స్వరూప రాణి ఉపాధ్యాయులు నాగేశ్వరరావు ఆర్ సూర్యకాంతం శైలజ శాంతి కుమారి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయండి

ఎంపీడీవో ఎస్ అప్పారావు

విశాలాంధ్ర-కురుపాం : ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు లబ్ధిదారులు సకాలంలో నిర్మాణం పూర్తిచేయాలని ఎంపీడీవో ఎస్. అప్పారావు అన్నారు. శనివారం కురుపాం-బి1 సచివాలయంలో మన ఇల్లు బిమన గౌరవం కార్యక్రమంలో భాగంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల మౌలిక వసతులతో కూడినటువంటి ఇనుము, ఇసక, సిమ్మెంటు సరఫరా చేసి లబ్ధిదారులు త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవడానికి సహకరిస్తామన్నారు. అలాగే అవసరమైన వారికి డిఆర్డీఏ ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. తహసిల్దార్ ఎం. రవణమ్మ ,హౌసింగ్ ఏఈ జి అచ్యుతమ్మ, వర్క్ ఇన్స్పెక్టర్ ఎస్. రాజేష్, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, కె.వి కొండయ్య, ఎస్, వంశీ, జీవీ రమణమూర్తి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబర్ 1 నుంచి అమేజాన్ ఫ్రెష్ ఫెస్టివ్ సూపర్ వేల్యూ డేస్

విశాలాంధ్ర- పాడేరు : అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఏడవ తేదీ వరకు అమేజాన్ ఫ్రెష్ సూపర్ వేల్యూ డేస్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. తాజా పండ్లు, కూరగాయలు, స్నాక్స్, పానియాలు, నిత్యవసరాలు సహా విస్తృత శ్రేణి ఉత్పత్తులలో 50 శాతం రాయితీలు అందిస్తున్నా మన్నారు. దుర్గా పూజ, దసరా, దీపావళి ఇంకా ఎన్నో పండగలతో పండగల సంబరాలు పూర్తిస్థాయిలో సమీపిస్తున్నందున, కస్టమర్లు తమ ప్యాంట్రీ బాగా నిండి ఉండటాన్ని నిర్ధారించడానికి తాము ప్రాధాన్యతనిచ్చిన సమయంలో ఇంటి వద్ద డెలివరీలు పొందే సౌకర్యంతో ఆశీర్వాద్, టాటా సంపన్, పార్లే, బికాజీ, పి&జి, మారికో, సెన్సోడైన్, నివియా, హిమాలయ, డవ్ వంటి బ్రాండ్స్‌పై ఆధారపడ్డారన్నారు. అమేజాన్ ఫ్రెష్‌కి ఇప్పటికే కస్టమర్‌గా ఉన్నా లేదా కొత్త కస్టమర్ అయినా, గొప్ప డీల్స్, విలువ ఆఫర్లతో, ప్రతి ఒక్కరు రాబోయే పండగ సీజన్‌ను భారీ ఆదాలతో సంబరం చేయవచ్చునన్నారు. ఫ్లాట్ రూ. 400 క్యాష్ బాక్‌తో 50 శాతం వరకు ప్రైమ్ రిపీట్ కస్టమర్లు ఆనందించవచ్చు అని చెప్పారు.

వై.రామవరం ఎస్ఐగా రామకృష్ణ

విశాలాంధ్ర-వై.రామవరం: వై.రామవరరం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బి.రామకృష్ణ శనివారం నియమితుల య్యారు. ఆయన గంగవరం మండలంలో ఎస్ఐగా పనిచేసి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇంతవరకు పనిచేసిన ఎస్ఐ సంతోష్ కుమార్ వర రామచంద్రపురం బదిలీ అయ్యారు. తన సేవలను గిరిజన గ్రామాల ప్రజలకు నిష్పక్షపాతంగా అందిస్తానని ఎస్ఐ రామకృష్ణ అన్నారు.

జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు

విశాలాంధ్ర-సీతంపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపికలను అక్టోబర్ 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఐటిడిఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన ఉదయం 9 గంటలకు ఐటిడిఎలోని ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో ఎంపికలు చేపడతామని తెలిపారు. ఈ ఎంపికలకు శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలోని బాలురు, బాలికలు క్రీడల్లో పాల్గొనుటకు అర్హులని తెలిపారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

మున్సిపల్ కమీషనర్ సత్యన్నారాయణ

విశాలాంధ్ర-సాలూరు : మున్సిపాలిటీలో ఆస్తిపన్ను, నీటిపన్ను, ఖాళీ స్థలాల పన్నుల వసూలులో లక్ష్యాలను పూర్తిచేయాలని మున్సిపల్ కమీషనర్ సి.హెచ్.సత్యన్నారాయణ అన్నారు. శనివారం తన కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్తిపన్ను రోజువారీ లక్ష్యాల మేరకు సోమవారం ఒక లక్ష రూపాయలు వసూలుచేసి జమచేయాలన్నారు. వీధిలైట్ల నిర్వహణ, నీటిసరఫరా కు అవసరమైన పనిముట్లు, విడిపరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. శానిటేషన్, మెప్మా, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో డిఈఈ శ్రీరామమూర్తి, ఏఈ సూరినాయుడు, మేనేజర్ రాఘవాచార్యులు, ఆర్ఓ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిపల్లిలో మన ఇల్లు మన గౌరవం

విశాలాంధ్ర-సాలూరు : మండలంలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని శనివారం మామిడిపల్లి గ్రామంలో గృహనిర్మాణ శాఖ అధికారులు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవిన్యూ అధికారి, గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి జి.కేశవనాయుడు హాజరయ్యారు. లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లా దారు. వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణం త్వరగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం రూ.1.80 లక్షల యూనిట్ ఖరీదుతో గృహాన్ని మంజూరు చేసిందని, స్వయం సహాయ సంఘాల సభ్యులకు 30 వేల రూపాయలు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. గృహ నిర్మాణ పథకం వచ్చే మార్చి నాటికి ముగుస్తుందని, కావున త్వరగా ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ డిసెంబర్ నాటికి పూర్తిచేయుటకు శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించి గృహ నిర్మాణానికి తోడ్పడుతుందని చెప్పారు. గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో తరచూ మాట్లాడుతూ సాంకేతికపరమైన సలహాలను అందిపుచ్చుకుంటూ నిర్మాణాలను త్వరగా చేపట్టాలని వివరించారు. గృహ నిర్మాణ దశలు త్వరగా ప్రగతి సాధించుటకు చర్యలు చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు గృహనిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే న్యాయ చట్టాలపై అవగాహన తప్పనిసరి

పాలకొండ డిఎస్పీ రాంబాబు

విశాలాంధ్ర-కురుపాం : విద్యార్థి దశ నుంచే న్యాయ, రక్షణ చట్టాలు పై అవగాహన తప్పనిసరి అని పాలకొండ డిఎస్పీ రాంబాబు సూచించారు.శనివారం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్ వి. మాధవరెడ్డి ఆదేశాల మేరకు కురుపాం ఎపి మోడల్ స్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పోక్సో, సైబర్ నేరాలపై విద్యార్థులకు చైతన్య పరిచారు. పాలు చట్టాలు పై అవగాహన కల్పించారు. అమ్మాయిలపై ర్యాగింగ్, అసభ్యకరంగా ప్రవర్తించి పోలీస్ కేసుల్లో ఇరుక్కుని జైలు పాలు కాకుండా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు డిస్పీ రాంబాబు సూచించారు. అలాగే మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలుపై విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ చిన్నారావు ఎల్విన్ పేట సిఐ హరి, ఎస్ఐ శివప్రసాద్, ట్రైనీ ఎస్ఐ మహా బూబ్ భాష, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఏ2047పై విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర-కురుపాం : స్వర్ణంధ్ర ఏ2047పై మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్, పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించారు. ఈ పోటీలకు 5 మండలాలు నుంచి 20 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. పోటీలలో వ్యాసరచన పోటీలో మొదటి స్థానం లో కందుల లాక్ష్య జిల్లా పరిషత్ కురుపాం ద్వితీయ స్థానం లో మఠ్రాపు రిషిత జిల్లా పరిషత్ కురుపాం విజేతలుగా నిలిచారు. వక్తృత్వ పోటీలో మొదటి స్థానం లో బి సాయి దీపిక జిల్లా పరిషత్ జియమ్మవలస, ద్వితీయ స్థానంఎం శశిశ్రీ జిల్లా పరిషత్ కురుపాం విజేతలుగా నిలిచారు.డిబేట్ పోటీలో మొదటి స్థానం కె ప్రనీత గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల రేగిడి, ద్వితీయ స్థానం యు సాత్విక్ జిల్లా పరిషత్ జియమ్మవలస విజేతలుగా నిలిచారు. పై మూడు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు కు తేదీ 30-09-2024 న సోమవారం జిల్లా స్థాయి పోటీలు కెపిఎం హై స్కూల్ పార్వతీపురం నందు ఉదయం 10 గంటలు కు హాజరు కావలెను అని మండల విద్యాశేఖధికారి ఎన్ సత్యన్నారాయణ మరియు నోడల్ హెడ్ మాస్టర్ టి శంకర రావు గారు మండల విద్యాశేఖధికారి -2 ఎన్ రాధాకృష్ణమూర్తి తెలిపారు.

రక్తదానం అంటే ప్రాణదానమే : సిఐ అప్పలనాయుడు

విశాలాంధ్ర-సాలూరు: రక్తదానం చేయడం అంటే ఓమనిషికి ప్రాణదానం చేయడమేనని పట్టణ సిఐ అప్పలనాయుడు అన్నారు. స్వతంత్ర సమరయోధులు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా మీకై మేము వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా పట్టణ సిఐ అప్పలనాయుడు హాజరయ్యారు. రక్తదానం చేయడం వలన ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చున్నారు.రక్తదానం చేయడానికి యువతీ యువకులు ముందుకురావాలన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసిన మీకై మేము అసోసియేషన్ అధ్యక్షుడు డా.ఇప్పిలి దిలీప్ కుమార్ ను అభినందించారు. దిలీప్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు తమ సంస్థ తరుపున ఎనిమిది రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. శనివారం నిర్వహించిన శిబిరం లో 32 మంది రక్తదానం చేశారన్నారు. రక్తదాన శిబిర నిర్వహణనకు సహాయ సహకారాలు అందించిన హెచ్‌డిఫ్‌సి బ్యాంక్ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. సేకరించిన రక్తనిధి ని విజయనగరం ఎస్‌విఎస్ బ్లడ్ బ్యాంక్ కు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో తెదేపా పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు,అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కూనిశెట్టి భీమ తదితరులు పాల్గొన్నారు.

అంచనాలకు అందని నష్టం... ఆదుకోని ప్రభుత్వాలు

విశాలాంధ్ర - చింతపల్లి/జీకే వీధి : అల్పపీడన ద్రోణి ప్రభావంతో మన్య ప్రాంతంలో అంచనాలకు అందని నష్టం జరిగి సుమారు 20 రోజులు కావస్తున్నా వరద ముంపు బాధితులను నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధంగానూ ఆదుకోకపోవడం అన్యాయమని ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి అన్నారు. జీకే వీధి మండలంలోని వరద బాధిత గ్రామాలలో శనివారం పాడేరు శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు శాసనసభ్యులు రేగం మచ్చలింగం, పాడేరు మాజీ శాసన సభ్యురాలు, ఎస్టి విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి లతో కలిసి గుమ్మిరేవుల, దారకొండ పంచాయతీల పరిధిలో తీవ్రంగా నష్టపోయిన మాది మల్లు, తోకరాయి, నిమ్మచెట్టు, గ్రామాలలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో వరద ముంపుకు పూర్తిగా కొట్టుకుపోయిన గృహాల వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో పాక్షికంగా దెబ్బతిన్న గృహాల వరద బాధితులకు లవ్ అండ్ కేర్ మిషనరీస్ వ్యవస్థాపకుడు దైవజనులు ఏసు పాదం సహకారంతో నిరాశ్రయులైన కుటుంబాలకు తాత్కాలికంగా నివాసం ఉండేందుకు టెంట్లు, నిత్యవసర సరుకులు, దుస్తులు, రగ్గులు పంపిణీ చేశారు. నిరాశ్రయులైన వరద కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించడంతోపాటు గృహాలు నిర్మించి ఆ కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు నష్టం వాటిల్లి సుమారు 20 రోజులు కావస్తున్నా, పాలకులు, అధికారులు ఇటువైపు చూడక పోవడం దురదృష్టకరమన్నారు. మంత్రి వచ్చి పర్యటించినా నేటి వరకు బాధితులకు తగిన న్యాయం జరగలేదన్నారు. ఒకరిద్దరు అధికారులు వచ్చినా గిరిజనులకు కనీస సాయం అందలేదని మండిపడ్డారు. వందల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, నివాస గృహాలు కొట్టుకుపోయి గిరిజనులు నిరాశ్రయులు అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదని ఆరోపించారు. పదుల సంఖ్యలో పశువులు వరదలో కొట్టుకు పోయాయని, అంచనాలకు అందని నష్టం జరిగిందని, కొండ ప్రాంతం కావడంతో నష్టం అంచనా అంత సులభం కాదని పేర్కొన్నారు. డ్రోన్ ల ద్వారా జీపీఎస్ సర్వే చేసి పంట నష్టం అంచనాలు తయారు చేయాలని, ప్రతీ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న ఆర్ ఓ ఆర్ ఎఫ్ పట్టాలతో పాటు అన్ని రకాల భూములకు పంట నష్టం చెల్లించాలని, వరద కారణంగా వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని, ఆ భూములను సాగుకు అనుకూలంగా తయారు చేసి ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సాగుకు అనుకూలం కాకపోతే, మరోచోట ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలన్నారు. ఉపాధి కోల్పోయిన వారికి గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వివిధ గ్రామాలలో గృహాలు కోల్పోయిన సుమారు 70 మందికి సురక్షితమైన ప్రాంతాలలో గృహాలు నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జి కే వి డి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, చింతపల్లి, జి కే వీధి జడ్పిటిసిలు పోతురాజు బాలయ్య, కిముడు శివరత్నం, సర్పంచ్ జిల్లా ఫోరం చింతపల్లి మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత, చింతపల్లి ఎంపీటీసీ సభ్యురాళ్లు దాసరి దారలక్ష్మి, చిందాడ జయలక్ష్మి, గుమ్మిరేవుల పంచాయతీ సర్పంచ్ ముర్ల కమలమ్మ, ఉప సర్పంచ్ జ్వరంగి వెంకటరమణ, వైకాపా అల్లూరి జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీటీసీలు జీకే వీధి ఎంపీటీసీ సభ్యురాలు రాజులమ్మ, రింతాడ ఎంపీటీసీ సభ్యురాలు ఈశ్వరమ్మ, వైకాపా సీనియర్ నాయకులు బూసరి కృష్ణారావు, కిముడు మూర్తి, కూడా బొంజి బాబు, కిల్లో ప్రసాద్, జెర్రెల చంద్రబాబు, వేమా మాణిక్యం, కొర్ర మిన్నల రావు జీకే వీధి మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.